క్లుప్తంగా

ప్రసన్న పరామర్శ



ఇందుకూరుపేట: మండలంలోని సోమరాజుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి సీతారామిరెడ్డి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. సీతారామిరెడ్డి సతీమణి సుదర్శనమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో వారి స్వగ్రామంలో జరిగిన ఉత్తరక్రియల్లో ఆయన పాల్గొని, ఆమె చిత్రపటానికి నివాళులర్పించి సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ జెడ్పీటీసీ బీవీ రమణయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కొత్తూరు విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

ఇందుకూరుపేట: ఈనెల 11, 12వ తేదీల్లో చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలకు మండలంలోని కొత్తూరు విద్యార్థులు సుహేల్, పూనమల్లి పావని, లేబూరు వెంకట కావ్య ఎంపికయ్యారు. ఈ మేరకు వారిని బుధవారం హెచ్‌ఎం మల్లికార్జున, పీడీ అరోరా, ఉపాధ్యాయులు అభినందించారు.

డాక్టరేట్ ప్రదానం



సాయికిరణ్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిశోధన విద్యార్థి సాయికిరణ్‌కు డాక్టరేట్‌ను వీఎస్‌యూ ప్రదానం చేసింది. టూరిజం శాటిలైట్ అకౌంట్స్.. మెజరింగ్ ఎకనమిక్ ఇంపాక్ట్ ఆఫ్ టూరిజం ఇండస్ట్రీ ఏ కేస్ స్టడీ ఆన్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై వర్సిటీలో పర్యాటక శాఖ అధ్యాపకుడు నీలమణికంఠ పర్యవేక్షణలో పరిశోధన చేయడంతో డాక్టరేట్‌ను అందజేశారు. సాయికిరణ్‌ను వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సునీత తదితరులు అభినందించారు.

నాణ్యత ప్రమాణాలను పాటించేలా అడుగులేయాలి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా



వెంకటాచలం: వస్తువుల తయారీ, పంటలు పండించడంలో నాణ్యత ప్రమాణాలను పాటించే దిశగా అడుగులేయాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కాకుటూరు వద్ద గల వీఎస్‌యూలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్, ఎఫ్ఎస్ఎంఈ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కాన్‌క్లేవ్‌కు హాజరైన ఆయన మాట్లాడారు. జిల్లాలో పుట్ల లెక్కన.. గోదావరి జిల్లాల్లో బస్తాల్లెక్కన విక్రయిస్తుండటంతో స్పష్టత లేదని చెప్పారు. ఉత్తరాదిలో విక్రయించాలంటే పుట్లా.. లేక బస్తాల్లెక్కనా అనే ప్రశ్న అక్కడి వారికి అర్థం కాదన్నారు. వస్తువులైనా, పంటైనా నాణ్యత ఉంటే అంతర్జాతీయ మార్కెట్లోనూ ప్రవేశం దొచ్చని చెప్పారు. వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



పొదలకూరు / మనుబోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డిని సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన పార్టీ స్టేట్ ఐటీ వింగ్ జాయింట్ సెక్రటరీ పాతపాడి హేమంత్ కుమార్‌రెడ్డి, సోషల్ మీడియా స్టేట్ జాయింట్ సెక్రటరీ ఆవుల తులసీరామ్‌యాదవ్ బుధవారం కలిశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.



ధరల్లేక అన్నదాత దిగాలు

- నామమాత్రపు రేట్లకే విక్రయం
- కొనుగోలు కేంద్రంలో గింజ కొంటే ఒట్టు



రోడ్డుపై ధాన్యం రాసి

మనుబోలు: ఖరీఫ్ సీజన్లో ఎన్నో ఆశలతో వరిని సాగు చేసిన రైతులు.. పండించిన ధాన్యానికి ప్రస్తుతం గిట్టుబాటు ధరల్లేక దిగులు పడుతున్నారు. మండలంలోని రాజోలుపాడు, బండేపల్లి, కుడితిపల్లి, జట్ల కొండూరు, చెర్లోపల్లి, మనుబోలు తదితర గ్రామాల్లో దాదాపు వెయ్యెకరాల్లో వరిని సాగు చేశారు. ప్రధానంగా కేఎన్ఎం 1010 రకాలను వేశారు. అయితే గతేడాదితో పోలిస్తే ప్రస్తుతం ధాన్యం ధరలు దారుణంగా పడిపోయాయి. గతంలో ఇదే సమయంలో పుట్టి రూ.22 వేల నుంచి రూ.24 వేలుండగా, ప్రస్తుతం రూ.15 వేల నుంచి రూ.17 వేల మధ్యే ఉన్నాయి. ఫలితంగా పుట్టికి రూ.ఆరేడు వేలను అన్నదాతలు నష్టపోతున్నారు.

అంతా ఆర్భాటమే..

వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని.. అన్నదాతలను ఆదుకుంటామని తరచూ ప్రకటనలు చేసే ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. మొక్కుబడిగా ఓ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంది. ఖర్చులు తడిచి మోపెడవుతున్న నేపథ్యంలో పాతాళానికి పడిపోయిన ధరలతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పెట్టుబడుల కోసం చేసిన అప్పులు, వాటి వడ్డీలతో చేసేదేమీ లేక నామమాత్రపు ధరలకే విక్రయించాల్సి వస్తోంది.

కొంత మంది రైతులు రోడ్లు, డొంకల్లో ధాన్యం రాసులు పోసి ఆరబెట్టుకుంటూ ధరలు పెరుగుతాయని ఆశపడుతున్నారు.



పొలాల్లో ధాన్యాన్ని విక్రయిస్తున్న రైతులు

పెట్టుబడులూ వచ్చేలా లేవు



ఈ ఖరీఫ్‌లో పదెకరాల్లో 1010 రకం వరిని సాగు చేశా. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడిగా పెట్టాం. ధాన్యం ధరలు దారుణంగా పడిపోయాయి. 1010 రకం ధాన్యాన్ని రూ.14,700కే విక్రయించాం. కొనుగోలు కేంద్రం ఉన్నా, 1010 రకం కొనుగోలు చేయమని చెప్పారు. ఇటీవలి సంవత్సరాల్లో ఇంత తక్కువ ధరలు ఎప్పుడూ లేవు.

– రమణారెడ్డి, మనుబోలు

ధాన్యాన్ని విక్రయించాక కొనుగోలు కేంద్రమా..?



వరికోతలు పూర్తయి నామమాత్రపు ధరలకు ధాన్యాన్ని విక్రయించాం. మనుబోలులో కొనుగోలు కేంద్రాన్ని నాలుగు రోజుల క్రితం ఏర్పాటు చేశారు. దీని వల్ల ఉపయోగమేమిటి. పైగా అక్కడ సవాలక్ష నిబంధనలతో ఇబ్బంది పెడతారు. ఇవన్నీ వేగలేకే అక్కడికి వెళ్లడం లేదు.

– వెంకటేశ్వర్లు, రైతు, రాజవోలుపాడు

సద్వినియోగం చేసుకోవాలి



గతంతో పోలిస్తే ధాన్యం ధరలు ప్రసుతం తక్కువగా ఉన్న మాట వాస్తవమే. రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. క్వింటాల్ సాధారణ రకానికి రూ.2369, ఏ గ్రేడ్‌కు రూ.2389 ధర ఇస్తున్నాం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటకృష్ణ, మండల వ్యవసాయాధికారి

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



వెంకటాచలం: మండలంలోని ఈదగాలి సమీపంలో నూతనంగా నిర్మించిన విశ్వ సముద్ర బయో ఎనర్జీ పరిశ్రమను ప్రారంభించేందుకు సీఎం చంద్రబాబు శుక్రవారం రానున్నారని సమాచారం. ఆయన పర్యటన అధికారికంగా ఖరారు కాకపోయినా, హెలిప్యాడ్, రోడ్లను జిల్లా అధికారులు ఏర్పాటు చేయించారు. ఏర్పాట్లను కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల తదితరులు పరిశీలించి పలు సూచనలు చేశారు. పర్యటన అధికారికంగా గురువారం ఖరారయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

దోచుకోవడం.. దాచుకోవడానికే పరిమితం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

తోటపల్లిగూడూరు: సూపర్ సిక్స్ పథకాలను పక్కనబెట్టి.. దోచుకోవడం.. దాచుకోవడంలో కూటమి ప్రభుత్వం, నేతలు సూపర్‌హిట్‌గా నిలిచారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మత్స్యకార నేత పామంజి దుర్గా విమర్శించారు. కోడూరు సచివాలయ సమీపంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. ఆయకట్టును పెంచాలని, నీటి సామర్థ్యాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో కోడూరు చెరువులో పూడికతీత పనులను గత ప్రభుత్వ హయాంలో చేపట్టారని వివరించారు. అయితే మట్టి ఆక్రమణ జరిగిందంటూ కొందరు టీడీపీ నేతలు నాటకాలకు తెరలేపుతున్నారని ధ్వజమెత్తారు. తమ పార్టీ నేతలపై అసత్య ఆరోపణలను మాని రైతులకు పనులు చేయాలని హితవు పలికారు. అనంతరం పార్టీ సౌత్‌ఆములూరు నేత వేముల శ్రీనివాసులు మాట్లాడారు. గ్రామానికి చెందిన ఓ టీడీపీ నేత.. కొందర్ని అడ్డం పెట్టుకొని అరాచకాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. విలుకానుపల్లి సమీపంలో తన పొలంలోకి వెళ్లే సమయంలో అడ్డగించి దాడులకు పాల్పడుతున్నారని, ఇదేమని ప్రశ్నిస్తే అట్రాసిటీ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. కోడూరు చెరువులో పదెకరాలను తాను ఆక్రమించానని టీడీపీ మండలాధ్యక్షుడు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. నేతలు కావల్‌రెడ్డి రంగారెడ్డి, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, నేతలు మారంరెడ్డి బుజ్జిరెడ్డి, పుల్లూరు శేషు, గౌస్‌బాషా, కంజి హరిప్రసాద్, వేముల సుబ్రహ్మణ్యం, వాసు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నను కలిసిన నేతలు



కోవూరు: కోవూరు టౌన్‌కు చెందిన దేవరం సాయి యశ్వంత్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడిగా నియమితులైన క్రమంలో ఆయన మాజీ మంత్రి, పార్టీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి పూలమొక్కను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, కోవూరు మండలాధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, వలంటీర్ల విభాగం జిల్లా కార్యదర్శి కవరగిరి ప్రసాద్, నాయకులు గున్నం జనార్దన్, చంద్రశేఖర్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

‘ఆటోడ్రైవర్ల సేవ’ కొందరికేనా..?



కరపత్రాలను ప్రదర్శిస్తున్న సీఐటీయూ నేతలు

తోటపల్లిగూడూరు: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్ల సేవ పథకం అందరికీ అందలేదని ఆటో కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి మారుబోయిన రాజా పేర్కొన్నారు. మండలంలోని నరుకూరు సెంటర్‌లో ఈ నెల 11, 12న నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను బుధవారం పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. జిల్లాలో 38 వేల ఆటోలుండగా, 17,400 మందికే పథకం వర్తించిందని చెప్పారు. హామీ మేరకు లైసెన్స్ కలిగిన ప్రతి ఆటో డ్రైవర్‌కు పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. నరుకూరు సెంటర్ ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాశిన పరశురామయ్య, ఆరణి గోపి, శివ, కోమారి వెంకటశేషయ్య, పచ్చా చిన్నారావు, నక్కా మనోహర్, దయాకర్, గణేష్, భాస్కర్, ఆకుల రఘు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కొరత తీర్చాలని వినతి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి కొరత తీర్చాలని బీజేపీ పట్టణ నాయకులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేటి నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్

పొదలకూరు: మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు, ఎంపికలను స్థానిక డీఎన్నార్ జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నామని ఎంఈఓ – 1 రేణుక పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆమె మాట్లాడారు. అండర్ – 14, 17 బాలబాలికలకు క్రీడలను నిర్వహించనున్నామని వివరించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు డివిజన్ స్థాయిలో పాల్గొననున్నారని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్ పోటీలను గురువారం.. అథ్లెటిక్స్, యోగా, బాడ్మింటన్‌ను శుక్రవారం నిర్వహించనున్నామని వెల్లడించారు. వివరాలకు 94948 12464, 99850 31776 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నేడు

ముత్తుకూరు(పొదలకూరు): ముత్తుకూరులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని గురువారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నామని పార్టీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హాజరుకానున్నారని వివరించారు. పార్టీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

మనుబోలు: కారు ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన మనుబోలులోని వైఎస్సార్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. తూర్పు గిరిజన కాలనీకి చెందిన తిరుమలశెట్టి మస్తానయ్య పనులు ముగించుకొని ఇంటికెళ్లేందుకు గానూ హైవే దాటుతున్నారు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి గూడూరువైపు వేగంగా వెళ్తున్న కారు ఢీకొనడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడ్ని 108లో గూడూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలి

- జెడ్పీ సీఈఓ మోహన్‌రావు



కొడవలూరు దళితవాడలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ

కొడవలూరు: తడి, పొడి చెత్తపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇంటి వద్దనే వాటిని వేరు చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఆదేశించారు. కొడవలూరులోని దళితవాడలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడి పారిశుద్ధ్య సిబ్బంది ఇంటికే వచ్చి చెత్త సేకరిస్తున్నారా.. లేదా? అని అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్తలపై గ్రామస్తుల్లో అవగాహన పెంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి డ్రెయినేజీ కాలువల పూడికతీత ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. అనంతరం ఆయన పంచాయతీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్తలను ఇంటి వద్దనే వేరు చేయడం వల్ల ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు. ఈ విషయంలో ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల వాటిని కలిపి ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.వెంకట సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి మురళి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నాయుడుపాళెంలో కేంద్ర బృంద సభ్యుడి పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అమలవుతున్న కార్యక్రమాలపై ఆరా తీస్తున్న కేంద్ర బృంద సభ్యుడు

కొడవలూరు: మండలంలోని నాయుడుపాళెం అంగన్‌వాడీ కేంద్రాన్ని కేంద్ర బృంద సభ్యుడు కరకవలస శరత్‌కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులతో మాట్లాడారు. పిల్లల ఎత్తు, బరువు ప్రతినెలా చూస్తున్నారా లేదా, పౌష్టికాహారం క్రమం తప్పకుండా ఇస్తున్నారా.. లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రీస్కూల్ పిల్లలకు క్రమం తప్పకుండా ఆహారం వండి పెడుతున్నారా అని అడిగారు. అనంతరం పిల్లల ఇంటికే వెళ్లి స్వయంగా బరువు, ఎత్తు చూసి రికార్డుల్లో వ్యత్యాసాలున్నాయా? అని పరిశీలించారు. చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తున్నారా అని ఆరాతీశారు. అన్నీ సక్రమంగా అమలవుతుండడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.నాగభూషణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త ఎస్తేరమ్మ, సహాయకురాలు సుజాతమ్మ ఉన్నారు.

చేతుల శుభ్రతపై అవగాహన పెంచాలి



చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

కొడవలూరు: చేతుల పరిశుభ్రతపై పిల్లల్లో అవగాహన పెంచాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.ఉమ సూచించారు. పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం–2 అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బుధవారం అవగాహన కల్పించారు. భోజనానికి ముందు, తరువాత చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవడం వల్ల అనేక రకాల రోగాలను దూరం చేయవచ్చన్నారు. పిల్లలకు రెండేళ్ల వరకు తల్లిపాలనే ఇవ్వడం ఎంతో ఆరోగ్యకరమన్నారు. ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువు విధిగా చూడాలన్నారు. తద్వారా పిల్లల్లో ఎదుగుదలను గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం మహేశ్వరి, సచివాలయ ఏఎన్‌ఎం సలోమి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఐ.ధనమ్మ, జోత్స్న, కవిత, హెల్పర్ సరళ, ఆశా కార్యకర్త భవాని పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయంపై అవగాహన



మాట్లాడుతున్న మారుతిదేవి

ముత్తుకూరు(పొదలకూరు): వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సును మండలంలోని పంటపాళెంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు శిక్షణ కేంద్ర ఏడీఏ మారుతిదేవి మాట్లాడారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందే పథకాలను వివరించారు. శాస్త్రవేత్తలు పరమశివం, కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త విజయకుమార్ నాయక్, ఏఓ జ్యోత్స్నరాణి, సొసైటీ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఏఈఓ దేవరాజ్, వీఏఏలు రమణమ్మ, అబ్దుల్ కరీమ్, శశి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశీలన



పొదలకూరు: స్థానిక ఎమ్మార్వో కాలనీ, కనుపర్తి (హెచ్‌డబ్ల్యూ) అంగన్‌వాడీ కేంద్రాలను నీతిఆయోగ్ బృందానికి చెందిన సతీష్, శరత్ పరిశీలించారు. కేంద్ర శిశు సంరక్షణ మంత్రిత్వ శాఖ సక్షం 2.0 పథకాల్లో భాగంగా వీరు పర్యవేక్షించారు. వసతులు, పౌష్టికాహార పంపిణీ, బాలలకు ఆటవస్తువులు, వారి బరువు, ఎత్తు తదితర అంశాలను ఆరాతీశారు. లబ్ధిదారుల ఇళ్లకెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సామగ్రి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీడీపీఓ విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు రత్నమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు



పొదలకూరు: పట్టణంలోని ఎస్బీవీడీ డిగ్రీ కళాశాలలో జీఎస్టీపై అవగాహన సదస్సును సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. జీఎస్టీ 2.0తో ఎంత ఆదా చేసుకోవచ్చో వివరించారు. రూప, వెల్ఫేర్ అసిస్టెంట్ భార్గవ్‌కుమార్, డీఏ శ్రీహరి, ప్రిన్సిపల్ రామానాయుడు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, కృష్ణ, చంద్రశేఖర్, ప్రిన్సిపల్ సుబ్బారావు, జీఎస్ రెడ్డి, డీఎస్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- జీఎస్టీ అమలుపై పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి తరలింపు



ట్రాక్టర్లకు మట్టిని లోడ్ చేస్తున్న జేసీబీ

విడవలూరు: అనుమతుల్లేకుండా పట్టపగలే మట్టిని తరలిస్తూ అధికారులకు సవాల్ విసురుతున్నారు కొందరు అక్రమార్కులు. టీడీపీ మండల ఇన్‌చార్జి సొంత గ్రామమైన పార్లపల్లిలో కొందరు వ్యక్తులు జేసీబీని పెట్టి దాదాపు 10 ట్రాక్టర్లతో పొలాల నుంచి మట్టిని తరలించి గ్రామంలో కొందరు వ్యక్తులకు విక్రయిస్తున్నారు. వీరికి ఎలాంటి అనుమతులు లేనప్పటికీ పట్టపగలే బహిరంగంగా మట్టిని తరలిస్తున్నారు. అంతేకాకుండా లైసెన్స్ లేని వ్యక్తులు, మైనర్లు ట్రాక్టర్లను నడుపుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో కూడా అర్ధరాత్రుల్లో అక్రమంగా మట్టిని తరలించిన ఘటనలు పార్లపల్లి గ్రామంలోనే జరిగాయి. మండల కేంద్రానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే ఇలా పట్టపగలే రోడ్లపై మట్టిని తరలిస్తుంటే రెవెన్యూ, పోలీస్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో తెలియాల్సి ఉంది. మండల కేంద్రం పరిస్థితే ఇలా ఉంటే మారుమూల ప్రాంతాల్లో మట్టి మాఫియా ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.